


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

సోమవారం 17 ఆగస్టు 2026 పేజీలు:10




## విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన 2001-02 పూర్వ విద్యార్థులు

- మునుగోడు జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి

ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు

**మునుగోడు, ఆగస్టు 16, (ప్రజా జ్యోతి )**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2026 పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పాఠశాల 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

వివరాలు 2లో



## కార్యకర్తలే నా బలం....

- వారి కుటుంబాలకు అండగా ఉంటా - ఎమ్మెల్యే జై వీర్

- ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ భరోసా
- ఎమ్మెల్యే సాయం పై గ్రామస్తులు హర్షం

**హాలియా,ఆగస్టు16(ప్రజా జ్యోతి)**

అనుముల మండల పరిధిలోని కొత్తపల్లి, కొరివేనిగూడెం గ్రామాలలో ప్రమాదాల బారినపడి గాయపడిన క్షతగాత్రులను,తీవ్ర అనారోగ్యంతో దైన్య స్థితిలో ఉన్న పలు కుటుంబాలను ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి పరామర్శించారు..ఆదివారం బాధితులు సీతారాములు,సీతా నాగరాజు,సీతా మంగమ్మ,దైద లక్ష్మణ్,తక్కెళ్ళపల్లి వెంకటయ్య నివాసాలకు స్వయంగా వెళ్లి వారిని అప్యాయంగా పలకరించారు. పరామర్శించడమే కాకుండా, వారిలో ధైర్యాన్ని నింపుతూ తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను,వారి జీవన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2 లో



## జపాన్ పర్యటనతో తెలంగాణ విద్యకు కొత్త దిశ

- అంతర్జాతీయ అనుభవాన్ని రాష్ట్ర విద్యా ప్రగతికి ఉపయోగించనున్న ఉపాధ్యాయుడు చారుగుండ్ల రాజశేఖర్

**గరిడేపల్లి,ఆగస్టు 16(ప్రజా జ్యోతి):**

తెలంగాణ విద్యా రంగంలో నూతన ఆలోచనలు, ఆధునిక సాంకేతికత,నాణ్యమైన బోధనా విధానాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ పర్యటనకు ఉపాధ్యాయుడు చారుగుండ్ల రాజశేఖర్ ఎంపికయ్యారు.

మిగతా 2 లో



## బస్‌స్టాప్‌ల దుస్థితి.. ప్రయాణికుల పాట్లు!

- కనీస సౌకర్యాలు కరువు.. కొన్ని బస్సులు ఆగని వైనం

- మంత్రి ప్రత్యేక చొరవతో నిధులు కేటాయించాలంటున్న ప్రజలు

**గరిడేపల్లి,ఆగస్టు 16(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని బస్‌స్టాప్ ప్రయాణికులకు కనీస సౌకర్యాలు అందించలేని దుస్థితిలో ఉంది.బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులకు సరైన షెల్టర్లు,కూర్చునే బెంచీలు, తాగునీరు,మరుగుదొడ్డి, మూత్రశాలలు,రాత్రివేళల్లో వెలుతురు వంటి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయి.

వివరాలు 2లో

## బంధాల కంటే స్క్రీన్ ప్రపంచమే ఎక్కువ

**నాంపల్లి, ఆగస్టు,16(ప్రజా జ్యోతి ):**



ఒకప్పుడు కుటుంబ సభ్యులతో కూర్చొని మాట్లాడటం.. స్నేహితులతో సరదాగా గడపడం.. పొరుగువారిని పలకరించడం.. బంధువుల యోగక్షేమాలు తెలుసుకోవడం మన జీవనశైలిలో భాగంగా ఉండేది. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మనిషికి మనిషికి మధ్య దూరం పెరుగుతుండగా, చేతిలోని సెల్‌ఫోన్ మాత్రం జీవితంలో విడదీయలేని భాగంగా మారింది.ఉదయం నిద్రలేచిన వెంటనే ఫోన్ చూడటం నుంచి రాత్రి నిద్రపోయే ముందు చివరిసారిగా ఫోన్ చూసే వరకు చాలామంది జీవితాలు మొబైల్ చుట్టూనే తిరుగుతున్నాయి. ఇంట్లో నలుగురు సభ్యులు ఉన్నా.. ఒక్కొక్కరి చేతిలో ఒక్కో సెల్‌ఫోన్. ఒకే గదిలో కూర్చున్నా పరస్పరం మాట్లాడుకునే పరిస్థితి తగ్గిపోతోంది....

వివరాలు 2లో

# జపాన్ పర్యటనతో తెలంగాణ విద్యకు కొత్త దిశ

మొదటిపేజీ తరువాయి

జపాన్‌లోని విద్యా విధానం, సాంకేతిక అభివృద్ధి,క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి అంశా లను ప్రత్యక్షంగా అధ్యయనం చేసి,అక్కడి ఉత్తమ విధానాల ను తెలంగాణ విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఉపయోగించడమే పర్యటన లక్ష్యం.

### జపాన్ విద్యా విధానంపై అధ్యయనం

సాంకేతిక ప్రగతి,క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధిలో జపాన్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది.అక్కడి విద్యా విధానంలో నైతిక విలువలు,బాధ్యత,స్వయం ఆధారితత్వం,ప్రాక్టికల్ నాలెడ్జ్, సృజనాత్మకతకు ఇచ్చే ప్రాధాన్యాన్ని అధ్యయనం చేసి, తెలంగాణ విద్యా రంగానికి ఉపయోగపడే ఉత్తమ విధానాలను గుర్తించడమే ఈ పర్యటన లక్ష్యం.సందర్శన కాదు.. అధ్యయన యాత్ర చారుగుండ్ల రాజశేఖర్ జపాన్ పర్యటన కేవలం విదేశీ పర్యటన గా కాకుండా అధ్యయన యాత్ర గా కొనసాగనుంది.అక్కడి విద్యాసంస్థల పనితీరు,బోధనా పద్ధతులు,సాంకేతిక వినియోగం, విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే విధానాలను ఆయన పరిశీలించనున్నారు. అలాగే విద్యపరిశ్రమల అనుసంధానం,నైపుణ్యాభివృ ద్ధి, సామాజిక బాధ్యత వంటి అంశాలపై అధ్యయనం చేసి, తెలంగాణ విద్యా రంగానికి ఉపయోగపడే ఉత్తమ విధానాలను గుర్తించనున్నారు.తెలంగాణ విద్యకు అంతర్జాతీయ అనుభవం జపాన్‌లో పొందే అంతర్జాతీయ అనుభవాన్ని తెలంగాణ విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఉపయోగిం చనున్నారు.అక్కడి ఉత్తమ బోధనా విధానాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా పరిశీలించి,సాంకేతికతతో పాటు క్రమశిక్షణ,సామాజిక బాధ్యత, సృజనాత్మకత,సమస్య పరిష్కార నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించే అంశాలను గుర్తించనున్నారు.

### ఒకరి అనుభవం.. ఎంతో మందికి మార్గదర్శకం

చారుగుండ్ల రాజశేఖర్ జపాన్ పర్యటన ద్వారా పొందే అంతర్జాతీయ అనుభవం ఉపాధ్యాయులు,విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవనుంది.ఒక ఉపాధ్యాయుడు పొందిన జ్ఞానం అనేక మంది విద్యార్థుల భవిష్య త్తుకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది."జ్ఞానాన్ని సంపాదించడం మాత్రమే కాదు.. సమాజ ప్రగతికి ఉపయోగించడ మే అసలైన లక్ష్యం"అనే భావనతో పర్యటన కొనసాగనుంది.

### విద్యా ప్రగతికి మైలురాయిగా

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ పర్యటనలు విద్యా రంగంలో నూతన ఆలోచనలు, నాణ్యమైన మార్పులకు దోహదపడనున్నాయి. జపాన్ విద్యా విధానాలు, సాంకేతికత, క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధిని అధ్యయనం చేసి తెలంగాణకు ఉపయోగపడే విధానాలను అందిపుచ్చుకోవాలి. జపాన్ పర్యటనకు చారుగండ్ల రాజశేఖర్ ఎంపిక కావడం అభినందనీయమని యూటీఎఫ్, పీఆర్టీయూ, ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు తెలిపారు. ఆయన పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# బస్‌స్టాప్‌ల దుస్థితి.. ప్రయాణికుల పాట్లు!

మొదటిపేజీ తరువాయి

బస్‌స్టాప్‌లు ఉన్నా.. ప్రయాణికులకు మాత్రం సౌకర్యాలు లేని పరిస్థితి నెలకొంది

### ఎండ.. వాన.. రోడ్డుపైనే నిరీక్షణ

ఎండ తీవ్రంగా ఉన్న సమయం లో నీడ కోసం,వర్షం కురిసినప్పు డు తలదాచుకునేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా మహిళలు,వృద్ధులు,విద్యార్థుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది.సరైన సీటింగ్ సౌకర్యం లేక చాలామంది రోడ్డు పక్కనే నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది.

### బస్సు వస్తుంది.. కానీ ఆగుతుందా?

కొన్ని బస్సులు బస్‌స్టాప్ వద్ద ఆగకుండా వెళ్లిపోతున్నాయనే ఆరోపణలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి.బస్సు వస్తుంద న్న ఆశతో ఎదురుచూసిన ప్రయాణికులకు బస్సు ఆపకుం డా వెళ్లిపోవడంతో తదుపరి బస్సు కోసం మరింత సమయం వేచి చూడాల్సి వస్తోంది.బస్ స్టాప్‌లో బస్సు ఆగకపోతే ప్రయాణికులు ఎక్కడ ఎక్కాలి? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బస్‌స్టాప్ వద్ద బస్సులు తప్పనిసరిగా ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### రాత్రివేళ భద్రతపై ఆందోళన

బస్‌స్టాప్ వద్ద సరైన లైటింగ్ లేకపోవడంతో రాత్రివేళ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బస్సు కోసం వేచి ఉండే సమయంలో చీకట్లో నిలబడాల్సి వస్తోందని స్థానికు లు చెబుతున్నారు.బస్‌స్టాప్‌ల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### మంత్రి ప్రత్యేక చొరవతో నిధులు కేటాయించాలి

ప్రజా రవాణాలో కీలకమైన బస్‌స్టాప్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు కేటాయిస్తే బెంచీలు,తాగునీరు, లైటింగ్ వంటి కనీస సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు.బస్‌స్టాప్‌ల దుస్థితిని అధికారులు పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలి బస్‌స్టాప్‌ల దుస్థితిని అధికారు లు పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని,బస్సులు ఆగేలా ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేయాలని, అభివృద్ధి పనులకు మంత్రి నిధులు మంజూరు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బస్‌స్టాప్‌లు పేరుకే కాదు.. ప్రయాణికులకు ఉపయోగపడే లా ఉండాలనీ ప్రయాణికులు కోరుతున్నారు.

### రెండు వైపుల బస్సులు వచ్చే విధంగా చూడాలి

గరిడేపల్లి మండలంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఇటీవల నిర్మించిన నాలుగు లైన్ల రోడ్డు కారణంగా ఒకవైపు వెళ్లే బస్సులు మాత్రమే బస్టాండ్ లోకి వచ్చే అవకాశం ఉంది,కోదాడ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్లే బస్సులు బస్టాండ్ లోకి రావడం లేదు.ఫోర్ వే రోడ్డు నిర్మించే సమయంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులు వెళ్లేందుకు యూటర్న్ వదిలివేయాల్సి ఉండగా ఎన్ హెచ్ 167 నిర్మించే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఒకవైపు మాత్రమే యూటర్న్ ఉంచి, మరోవైపు మధ్యలో రైలింగ్ ఏర్పాటు చేశారు. దీంతో మిర్యాలగూడ వైపు వెళ్లే బస్సులు బస్టాండ్ లోనికి రాలేకపోతున్నాయి. దీనిని ఆర్టీసీ అధికారులు దృష్టిలో పెట్టుకొని ఎన్ హెచ్ 167 అధికారులతో చర్చించి బస్సులు వెళ్లే విధంగా మధ్యలో ఉన్న డివైడర్ను తొలగించాలని ప్రయాణికులు, మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఉన్నత స్థాయి అధికారులను ఆదేశిస్తే వెంటనే మధ్యలో ఉన్న డివైడర్ను తొలగించే అవకాశం ఉంటుందని మండల నాయకులు చొరవ తీసుకొని ఆర్టీసీ అధికారులతో కలిసి మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### కోదాడ డిపో మేనేజర్ వివరణ :

గరిడేపల్లి బస్టాండ్ ను వినియోగంలోకి తేవడం ప్రయాణికులు సహకరించిన పట్ల కోదాడ బస్ డిపో మేనేజర్ హర్షం వ్యక్తం చేశారు. అన్ని బస్సులు బస్ స్టేషన్ ఆవరణలోకి వచ్చే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే బస్సు డ్రైవర్ లందరికీ గరిడేపల్లి బస్ స్టేషన్ లోకి వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా బస్టాండ్ లోకి వెళ్లకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగే విధంగా ఆర్టీసీ బస్సులు వ్యవహరిస్తే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అన్ని డిపోల కు చెందిన బస్సు డ్రైవర్లు సహకరించి గరిడేపల్లి బస్ స్టేషన్ లోకి తప్పనిసరిగా బస్సులు వెళ్లి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు.

### ప్రయాణికులు సహకరించాలి - గరిడేపల్లి ఎస్సై

మండల కేంద్రమైన గరిడేపల్లి లో ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రారంభమైంది కాబట్టి ఇకనుంచి పోలీస్ స్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపవద్దని గరిడేపల్లి ఎస్సై శ్రీకాంత్ గౌడ్ కోరారు. ప్రయాణికులంతా బస్టాండ్ లోకి వెళ్లి బస్సులు ఎక్కాలని ఆయన సూచించారు. పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై బస్సులు ఆగటంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందని దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని ఆయన తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికులు ప్రజలు సహకరించి వినియోగంలోకి వచ్చిన ఆర్టీసీ బస్టాండ్ లోకి వెళ్లి బస్సులు ఎక్కాలని ఆయన కోరారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, సిబ్బంది పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.

# బంధాల కంటే స్క్రీన్ ప్రపంచమే ఎక్కువ

మొదటిపేజీ తరువాయి

### బంధాల కంటే స్క్రీన్ ప్రపంచమే ఎక్కువ

సోషల్ మీడియా, వీడియోలు, ఆన్‌లైన్ గేమ్స్, చాటింగ్, రీల్స్ వంటి వాటితో గంటలు ఎలా గడిచిపోతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు సమయం లేదని చెప్పేవారు.. గంటల తరబడి ఫోన్‌లో గడపడం సాధారణంగా మారింది.ముఖాముఖి మాట్లాడే ఆత్మీయత తగ్గిపోతుంది మెసేజ్‌లు, ఎమోజీలు, వీడియో కాల్స్‌కే సంబంధాలు పరిమితమవుతున్నాయి. పక్కనే ఉన్న మనిషి భావాలను అర్థం చేసుకోవడం కంటే.. దూరంగా ఉన్న వ్యక్తి సోషల్ మీడియా పోస్టుకు స్పందించడం ముఖ్యంగా మారిన సందర్భాలు కనిపిస్తున్నాయి.

### పిల్లలపై ప్రభావం...

సెల్‌ఫోన్ వినియోగం పిల్లలపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆటస్థలాల్లో స్నేహితులతో కలిసి ఆడాల్సిన వయసులో మొబైల్ గేమ్స్,వీడియోలకు అలవాటు పడుతున్నారు. పుస్తకాలు చదవడం, పెద్దలతో మాట్లాడటం, ప్రకృతిని ఆస్వాదించడం వంటి అలవాట్లు క్రమంగా తగ్గుతున్నాయి.

### టెక్నాలజీ అవసరమే.. కానీ నియంత్రణ ముఖ్యం

సెల్‌ఫోన్ మనిషికి ఎంతో ఉపయోగకరమైన సాంకేతిక సాధనం. విద్య, ఉద్యోగం, సమాచారం, అత్యవసర సేవలు, కమ్యూనికేషన్ వంటి అనేక రంగాల్లో ఇది ఎంతో మేలు చేస్తోంది. అయితే అవసరానికి మించి వినియోగిస్తే అదే ఫోన్ మనుషుల మధ్య ఉన్న అనుబంధాలను దూరం చేసే సాధనంగా మారే ప్రమాదం ఉంది.అందుకే టెక్నాలజీని వదిలేయాల్సిన అవసరం లేదు.. కానీ దానికి మన జీవితాన్ని అప్పగించకూడదు.ప్రతిరోజూ కొంత సమయాన్ని కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు,స్నేహితులతో కలిసేందుకు, పిల్లలతో ఆడేందుకు కేటాయించాలి. మన చేతిలో ఉండాల్సిన సెల్‌ఫోన్.. మన జీవితాన్ని తన చేతిలోకి తీసుకోకూడదు. మనిషితో మనిషికి ఉన్న బంధమే నిజమైన సంపద. సెల్‌ఫోన్ మనకు దగ్గరగా ఉండాలి.. కానీ మనుషులను మనకు దూరం చేయకూడదు.

ప్రజాజ్యోతి
సోమవారం 17 ఆగస్టు 2026

# నిరుద్యోగ యువతకు ఉద్దీపన ఆధ్వర్యంలో ఉచిత పోటీ పరీక్షల శిక్షణ



**నకిరేకల్, ఆగస్టు 16: ప్రజా జ్యోతి.**

ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన ఉచిత పోటీ పరీక్షల శిక్షణా శిబిరాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే, ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ వేముల వీరేశం ఆదివారం ప్రారంభించారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ.. ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్‌ను 2015లో ప్రారంభించి, అప్పటి నుంచి పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నకిరేకల్ పట్టణంలో ఉద్దీపన పాఠశాలను ఏర్పాటు చేసి ఉచిత విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. కరోనా సమయంలో కషాయ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన కిట్లను పంపిణీ చేశామని, మృతుల అంత్యక్రియల్లోనూ దగ్గరుండి మానవతా సేవలు అందించామని గుర్తు చేశారు. నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని, నకిరేకల్ పట్టణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉచిత శిక్షణ పొందుతున్న ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి పోటీ పరీక్షల్లో విజయం సాధించి ప్రభుత్వ ఉద్యోగం పొందాలని



ఆకాంక్షించారు. నిరుద్యోగ యువతకు అండగా నిలిచి, వారి లక్ష్య సాధనకు అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, సీనియర్ నాయకులు పూజర్ల శంభయ్య, చామల శ్రీనివాస్, నాగులవంచ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య, ఆర్‌సీ రెడ్డి కోచింగ్ అధ్యాపకులు వేముల సైదులు, మండల పార్టీ అధ్యక్షుడు గాదగోని కొండయ్య, టౌన్ అధ్యక్షుడు లింగాల వెంకన్న, ఉద్దీపన కోఆర్డినేటర్ చెరుకు సతీశ్‌తో పాటు మాజీ కౌన్సిలర్లు, నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన 2001-02 పూర్వ విద్యార్థులు

మొదటిపేజీ తరువాయి

ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.మొదటి స్థానంలో నిలిచిన యంపల్ల దీక్ష 10 వే రూలు,ద్వితీయ స్థానంలో నిలిచిన బీమనపల్లి ఐష్ కు 5 వేల రూ మరియు దోటి గీత 5 వేల రూలు,తృతీయ స్థానంలో నిలిచిన కృష్ణవేణి కి 3 వేల రూలు ,ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, పాఠశాల సీనియర్ పూర్వ ఉపాధ్యాయులు నల్లి నిరంజన్ హాజరై, పూర్వ విద్యార్థుల చేతుల మీదుగా విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించారు.సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ మాట్లాడుతూ..చదువుకున్న పాఠశాలను గుర్తుంచుకుని, ప్రస్తుత విద్యార్థులను ప్రోత్సహించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.సీనియర్ పూర్వ ఉపాధ్యాయులు నల్లి నిరంజన్ తెలిపారు.విద్యార్థులు ఈ ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు బాలప్రసాద్,పాఠశాల చైర్మెన్ ఎల్లమ్మ 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్,కూరెళ్ళ జ్ఞానేశ్వర్, ముచ్చపోతుల రవి,బొల్లు సైదులు,జీడిమెట్ల రవీందర్,నారగోని శ్రీశైలం, జుట్టగొని వెంకటేశం ముచ్చపోతుల శ్రవణ్,చేనేత సంఘం డైరెక్టర్ బొల్ల చంద్రకళ,వార్డు సభ్యులు బీమనపల్లి ప్రవళిక,నారగోని అనూష, ఉపాధ్యాయులు కునూరెడ్డి సత్తిరెడ్డి, రత్నయ్య,బాబురావు,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు..



## కార్యకర్తలే నా బలం.... వారి కుటుంబాలకు అండగా ఉంటా -ఎమ్మెల్యే జై వీర్

మొదటిపేజీ తరువాయి

బాధితులు ఎదుర్కొంటున్న కష్టాలను ఆలకించిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి,ఎలాంటి సమస్య వచ్చినా ధైర్యంగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆపత్కాలంలో నియోజకవర్గ ప్రజలకు కొండంత అండగా నిలుస్తానని,అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తానని భరోసానిచ్చారు.ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ,నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో నిరంతరం భాగస్వామిగా ఉండటమే తన ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. "ప్రజల కష్టాల్లో నేనున్నాను ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని ఆయన పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ యాదవ్,మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్,మార్కెట్ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పసునూరు కిరణ్ రెడ్డి,సర్పంచ్ పేర్ల సుమతి రవి,నకిరేకంటి సైదులు,మేరెడ్డి వెంకట నరసింహారెడ్డి, మేరెడ్డి రమణారెడ్డి,కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు,యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భానుచందర్ రెడ్డి, ఎడవల్లి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.మానవతా దృక్పథంతో స్పందించి నిరుపేద కుటుంబాలకు సాయం అందించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 16(ప్రజాజ్యోతి):**

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కోరారు.ఆదివారం సూర్యాపేట పట్టణంలోని బేచిరాగ్ మాధారంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో 16వ వార్డు కౌన్సిలర్ షేక్ జహీర్ ఆహ్వానం మేరకు ఆయన పాల్గొని శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్,మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు,మున్సిపల్ కౌన్సిలర్ వెలుగు వెంకన్న,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,మాజీ జెడ్పీటీసీ చింతమళ్ల రమేష్,జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం,మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి,గుణగంటి హేమ సతీష్,నిమ్మల కీర్తి లవన్,కుంభం రాజేందర్,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్,శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి,జిల్లా సేవాదళ్ చీఫ్ ఆలేటి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# నకిరేకల్ పట్టణంలో ఘనంగా శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ



**నకిరేకల్, ఆగస్టు 16 (ప్రజా జ్యోతి ):**

నకిరేకల్ పట్టణంలో శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల పండుగ సందర్భంగా పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ పన్నాల రాఘవరెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు చెవుగోని శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ కుట్టు మిషన్లతో మహిళలకు ఆర్థిక భరోసా!

**భువనగిరి, ఆగస్ట్ 16ప్రజాజ్యోతి**

మహిళా సాధికారతకు 'ఇందిరమ్మ' భరోసా....23వ వార్డులో అర్హులైన బీసీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి,స్వయం ఉపాధి దిశగా ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న,ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు'పథకాన్ని అర్హులైన మహిళలు సద్విని యోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల్లో నివసిస్తున్న అర్హులైన బీసీ మహిళలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం రూ.12 వేల విలువైన ఆటోమేటిక్ కుట్టు మిషన్ను 100 'శాతం సబ్సిడీపై ఉచితంగా అందించడం ద్వారా మహిళలకు ఇంటి వద్దే ఉపాధి కల్పించే దిశగా కీలక అడుగు వేసిందన్నారు. కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని కోరారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్లు, గృహజ్యోతి,స్మార్ట్ రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పూజిత జహంగీర్ తెలిపారు.

## సల్లంగా చూసే ముత్యాలమ్మ తల్లికి.. బంగారుకళ్లు సమర్పణ

**నకిరేకల్,ఆగస్టు 16, (ప్రజాజ్యోతి) :**

నకిరేకల్ పట్టణంలో బోనాల మహోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం లోని అమ్మవారి మూల విరాట్ కు భారతీయ జనతాపార్టీ పట్టణ అధ్యక్షుడు,కాళికామాత దేవాలయ చైర్మన్ గర్రె మురళీమోహన్ప్రభావతి దంపతులు బంగారు కళ్లను, చీరను సమర్పించారు.ఈ సందర్భంగా పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలునిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పన్నాల రాఘవరెడ్డి , కాంగ్రెస్ నాయకుడు చెవుగొని శ్రీనివాస్, కాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా గొంగిడి సునీత మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**గుండాల, ఆగస్టు 16(ప్రజా జ్యోతి):**

ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్రెడ్డి జన్మదిన వేడుకలను గుండాల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎండి ఖలీల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవిస్తూ, ప్రజలకు మరింత సేవ చేయాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాచిల్ల సర్పంచ్ అలంశెట్టి మహేష్, గుండాల గ్రామ శాఖ అధ్యక్షుడు గిరికత్తుల శ్రీనివాస్, బబ్బురి సుధాకర్, తాంద్ర శోభన్ బాబు, చెన్నారెడ్డి, పంగ సతీష్ రెడ్డి, నాగెల్లి రమేష్, అన్నేపర్తి భిక్షం,అట్ల రంజిత్ రెడ్డి, కొమ్మగల్లదయాకర్, వంగూరు అనిల్, కారుపోతుల సాయికుమార్, ఆవుల శివ, శ్రీరాముల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్ రేషన్ కార్డుపై ప్రధాని మోదీ ఫొటో పెట్టాలి

**కేతేపల్లి ఆగస్టు 16 ప్రజా జ్యోతి**



తెలంగాణ ప్రభుత్వం ఇటీవల పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోను కూడా ముద్రించాలని బీజేపీ జిల్లా ఓబీసీ నాయకులు తాడోజు నరసింహాచారి డిమాండ్ చేశారు.పేదలకు అందుతున్న రేషన్ బియ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, స్మార్ట్ రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఫోటోలను మాత్రమే ముద్రించడం సరికాదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వన్ నేషన్‌వన్ రేషన్ కార్డు విధానం ద్వారా దేశవ్యాప్తంగా రేషన్ పంపిణీలో పారదర్శకత, పోర్టబిలిటీకి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత ఆహార ధాన్యాల సరఫరా కోసం భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో, రేషన్ కార్డుపై ప్రధాని మోదీ ఫొటోకు కూడా స్థానం కల్పించాలని నరసింహాచారి కోరారు. పేదలకు అందించే సంక్షేమ పథకాలను రాజకీయ ప్రచారానికి ఉపయోగించకుండా, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల పాత్రను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.రేషన్ కార్డులపై రాజకీయ రంగు పులమడం తగదని, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముందే ప్రధాని మోదీ ఫోటోను కూడా ముద్రించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## పెయింటింగ్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

### - అధ్యక్షుడిగా గంగాపురం రమేష్

**చౌటుప్పల్, ఆగస్టు 16 ( ప్రజా జ్యోతి )**

చౌటుప్పల్ డివిజన్ పెయింటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వలిగొండ మండలం సంగం గ్రామానికి చెందిన గంగాపురం రమేష్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎండీ సలీం ఖాన్, ముత్యాల సతీష్, ప్రధాన కార్యదర్శిగా మందారి మహేష్, సహాయ కార్యదర్శిగా పిల్ల సాగర్, కోశాధికారిగా అంకూరి బాబు శంకర్, ఉప కోశాధికారిగా ఆరుట్ల గణేష్ ఉన్నారు. ప్రచార కార్యదర్శులుగా ఏచూరి అనిల్, ఎస్కె జావిద్, కార్యవర్గ సభ్యులుగా మల్లేష్, అంజి, కృష్ణ, వి. మల్లేష్ కొనసాగనున్నారు. గౌరవ అధ్యక్షులుగా బండమీది ఎల్లయ్య, పిల్ల మల్లేష్, ఎర్ర శంకరయ్య, గౌరవ సలహాదారులుగా ఊదరి నరసింహ, మందారి గాలయ్యలను నియమించారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పెయింటింగ్ కార్మికులకు వృత్తిపరమైన శిక్షణ, పని ప్రదేశాల్లో భద్రతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఉపాధి అవకాశాల మెరుగుదలకు కృషి చేస్తామన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుండి, సంఘాన్ని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.






# అధికారులూ...ఒంటరి మహిళకు ‘ చేయూత ‘ నివ్వండి...!

### - పెన్షన్ దరఖాస్తుదారులకు ధృవీకరణలో జాప్యం తగదు

### - బిఆర్ఎస్ పట్టణ నాయకులు

**మిర్యాలగూడ, ఆగస్టు 16, ( ప్రజాజ్యోతి ):**

అయినవారిని కోల్పోయి.. ఒంటరితనంతో బ్రతుకు భారమై... జీవిస్తున్న మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత పథకం 'పెన్షన్' ను అందించడంలో జాగు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వీడి దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్ర మంద చేయాలని మిర్యాలగూడ పట్టణ బి ఆర్ ఎస్ నాయకులు కోరారు.ఆదివారం స్థానికంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లోపలువురునాయకులు మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఒంటరి మహిళా పెన్షన్‌కు అర్హులైన దరఖాస్తుదారులకు తహశీల్దార్ ధృవీకరణ పత్రాలు సకాలంలో జారీ చేయకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరి మహిళా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అనేక మంది మహిళల కు అవసరమైన తహశీల్దార్ ధృవీకరణ పత్రాలు అందకపోవడం తో తమ దరఖాస్తుల పరిస్థితి ఏమిటో తెలియకఅయోమయానికిగురవుతున్నారన్నారు. భర్తను కోల్పోయిన లేదా కుటుంబానికి దూరంగా ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు ప్రభుత్వ పెన్షన్ ఎంతో కీలకమైన ఆర్థిక సహాయమన్నారు. ఈ పరిస్థితుల్లో అధికారుల నిర్లక్ష్యం లేదాధృవీకరణ ప్రక్రియలో జాప్యం కారణంగా అర్హులైన మహిళలు సంక్షేమ పథకానికి దూరం కాకూడదన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని సంబంధితతహశీల్దార్లకు నల్లగొండ జిల్లా కలెక్టర్ వెంటనే ఆదేశాలు జారీ చేసి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులనుపరిశీలించి అర్హులైన ఒంటరి మహిళలకు ధృవీకరణ పత్రాలను తక్షణమే జారీ చేయించాలని బిఆర్ఎస్ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది.అలాగే అర్హత కలిగిన ప్రతి ఒంటరి మహిళకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ అందేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే బాధిత మహిళల తరపున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలుచేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి.ఇలియాస్ ఖాన్, కౌన్సిలర్లు, నాయకులు పెద్ది శ్రీనివాస్ గౌడ్, పద్మశెట్టి లక్ష్మీకోటేశ్వర రావు, తిరంశెట్టి సీతాకోటేశ్వర రావు, పునాటిలక్ష్మీనారాయణ, దీపిక విజయ్, జానకమ్మ దుర్గాప్రసాద్, లావుడి అరుణ సుధాకర్, సందేషి రజిని అంజన్ రాజు, మద్రి అంజిబాబు,తిరుమలగిరి వజ్రం, వద్దేపల్లి శ్రీనివాస్, జన్నపాల సునీత కిరణ్, యర్రమల్ల దినేష్, గంగుల బిక్షం యాదవ్, భూక్య రాంబాబు, ఆయిల వెంకన్న, ఎనుగంటి తిరుపతయ్యనాయుడు, వల్లపట్ల వినోద్, కందగట్ల అశోక్, పందిరి వేణు, నునే రవికుమార్, కంచర్కుంట్ల దయాకర్ రెడ్డి,నేరెళ్ళ శివ ఉన్నారు.

## కేజీబీవీ ఎస్ఓను వెంటనే సస్పెండ్ చేయాలి ఎన్ ఎస్ యూ ఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ డిమాండ్

**దేవరకొండ,నేరేడుగొమ్ము, ఆగస్టు 16, (ప్రజా జ్యోతి) :**



నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఎస్ఓను వెంటనే విధుల్లోంచి సస్పెండ్ చేయాలని ఎన్ ఎస్ యూ ఐ జాతీయ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పానుగంటి శ్రీకాంత్ తీవ్రస్థాయిలో డిమాండ్ చేశారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కేజీబీవీ పాఠశాలలో జాతీయ జెండాను తలకిందులుగా ఆవిష్కరించడం పై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశభక్తిని, జాతీయ గౌరవాన్ని విద్యార్థులకు ఆదర్శంగా నిలపాల్సిన విద్యాసంస్థలోనే మువ్వన్నెల జెండాకు ఇలాంటి అవమానం జరగడం అత్యంత సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు.ఈ ఘోర తప్పిదానికి కారణమైన కేజీబీవీ ఎస్ఓ తో పాటు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల సిబ్బందిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జాతీయ జెండాను అవమానపరిచిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.జాతీయ జెండాకు జరిగిన ఈ అవమానాన్ని ఎంతమాత్రం సహించేది లేదని, బాధ్యులైన వారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకునేంత వరకు ఎన్ ఎస్ యూ ఐ ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తామని పానుగంటి శ్రీకాంత్ హెచ్చరించారు.

# అగ్ని పరీక్షలో అమాన్ మెరుపులు...

## - బిగ్ బాస్ సీజన్ 10 కి ఎంపికైన హాలియా యువకుడు

### - అత్యుత్తమ నటనతో అగ్ని పరీక్షలో గెలిచి తదిబరిలో నిలిచిన అమాన్

### - అభిజిత్ నవదీప్ బిందు మాధవిల ప్రశంసలతో బిగ్ బాస్ సీజన్ 10 కి ఎంపిక

### - బిగ్ బాస్ సీజన్ 10 విజేతగా నిలిచేందుకు సై అంటున్న అమాన్




**హాలియా,ఆగస్టు16(ప్రజా జ్యోతి)**




నల్లగొండ జిల్లా అనుముల మండలం హాలియా పట్టణానికి చెందిన ఓ సాధారణ కుటుంబ యువకుడు తన అసాధారణ పట్టుదల,నటన దాహంతో తెలుగు బుల్లితెర ప్రతిష్టాత్మక రియాలిటీ షో 'బిగ్ బాస్ సీజన్ 10' కి ఎంపికై వార్తల్లో నిలిచాడు.పల్లె నుంచి పయనం ప్రారంభించి,వెండితెర కలల వేటలో వేల మందిని దాటుకుంటూ బిగ్ బాస్ వేదిక వరకు చేరుకున్న ఈ యువకుడి ప్రయాణం ఎంతో మంది ఔత్సాహిక కళాకారులకు స్ఫూర్తిదాయకంగా మారింది.సొంత ఊరిలో పదవ తరగతి పూర్తి చేసిన కుర్రాడు పట్టణంలో డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం బీటెక్‌లో చేరాడు.ఆ తర్వాత విదేశాలకు వెళ్లి స్థిరపడాలనే ఆలోచన కూడా అతనికి ఉండేది.అయితే చిన్నతనం నుంచే ఫ్యాషన్,గ్లామర్,సినీ రంగాల పట్ల ఉన్న అపారమైన మక్కువ అతని జీవిత గమనాన్ని మార్చేసింది.లక్షల రూపాయల సంపాదనను తెచ్చిపెట్టే విదేశీ అవకాశాలను, సుఖవంతమైన కెరీర్‌ను పక్కనబెట్టి,తన మనస్సాక్షి మాట విని రంగుల ప్రపంచం వైపు అడుగులు వేశాడు.కలలను నిజం చేసుకునే క్రమంలో ఏమాత్రం అలసత్వం వహించకుండా ఒకవైపు లా కోర్స్ (న్యాయ విద్య) పూర్తి చేస్తూనే,మరోవైపు నటనపై ఉన్న ఆసక్తితో యాక్టింగ్ కోర్సులో శిక్షణ పొంది తన నటన నైపుణ్యాలకు పదును పెట్టాడు. గత ఏడేళ్లుగా తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవడానికి నిరంతరం శ్రమిస్తున్నాడు.అనేక షార్ట్ ఫిలిమ్స్,ఓటీటీ ప్రాజెక్టులలో నటించి,తన అద్భుత ప్రదర్శనతో గుర్తింపు పొందుతూ,పెద్ద తెరపై సరైన అవకాశం కోసం వేచి చూస్తున్నాడు.ఈ క్రమంలోనే 'బిగ్ బాస్ సీజన్ 10' కి కామన్స్ విభాగంలో నిర్వహించిన అత్యంత కఠినమైన 'అగ్ని పరీక్ష' కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించింది.శనివారం రాత్రి జరిగిన ఈ అగ్నిపరీక్ష రౌండ్‌లో తన స్వయంకృషి, హాస్యచతురత,వైవిధ్యమైన నటనా ప్రదర్శనతో న్యాయ నిర్ణేతలైన ప్రముఖ నటులు అభిజిత్,నవదీప్,నటి బిందు మాధవిలను మంత్రముగ్ధులను చేశాడు.వీరి నుండి విశేషమైన ప్రశంసలు అందుకుని, పోటీదారులందరినీ దాటుకుంటూ గ్రాండ్ లాంచ్‌కు ఎంపికయ్యాడు.సాధన, పట్టుదల ఉంటే సామాన్యమైన నేపథ్యం నుంచి వచ్చినా శిఖరాగ్రాలను చేరుకోవచ్చని నిరూపించిన ఈ హాలియా యువకుడికి స్థానికులు, బంధుమిత్రులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు అందిస్తున్నారు.

# భువనగిరి లో ఆగస్ట్ 20న సిల్సిలా-యే-ముఅజ్జమియా యాకూబియా '2వ ద్వివార్షిక జష్న్-ఎ-సాలానా' మహాసభ...

## - ఖురాన్ మరియు ముస్లిం అంశంపై భోంగీర్‌లో భారీ ధార్మిక సదస్సు...

**భువనగిరి ఆగస్ట్16(ప్రజాజ్యోతి)**



సిల్సిలా-యే-ముఅజ్జమియా యాకూబియా భోంగీర్ ఆధ్వర్యంలో "2వ ద్వివార్షిక దీనీ వ ఇస్లాహీ తర్బియతీ వ తబ్లీఘీ ఇజ్తిమా" (జష్న్-ఎ-సాలానా) కార్యక్రమాన్ని ఈ నెల ల20వ తేదీ గురువారం (7 రబీ-ఉల్-అవ్వల్ 1448 హిజ్రీ) సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భోంగీర్‌లోని కాజీ మొహల్లా, దర్గా సయ్యద్ జమాలుల్ బహర్ ఖాద్రీ సమీపంలో ఉన్న లి.ఆర్. గార్డెన్ వేదికగా ఈ మహాసభ జరగనుంది.ఈ సదస్సులో ఖురాన్ మరియు ముస్లిం" అనే ముఖ్యమైన అంశంపై ప్రముఖ ఇస్లామిక్ పండితులు విస్తృతంగా ప్రసంగించనున్నారు.ప్రముఖుల సమక్షం ఘనంగా ఏర్పాట్లు పర్యవేక్షణ (జేరే నిగ్రానీ) ముఫక్కిర్-యే-ఖౌమ్ ఆలీ జనాబ్ అల్-హాజ్ మహమ్మద్ షేక్ మీరాన్ చౌదరి సాహెబ్ (నైబ్ సదర్ మర్కజీ కమిటీ జమియత్- ఉల్-అన్సార్ & చైర్మన్ గుల్షన్-ఎ-దాతార్ ఫౌండేషన్ భువనగిరి ) అధ్యక్షత (జేరే సదారత్): ఖలీఫా-యే-నజ్మూల్ ఆరిఫీన్ పీర్-యే-కామిల్ హజ్రత్ మహమ్మద్ ముఅజ్జమ్ అలీ షా యాకూబీ నూరీ చిష్తీ అల్ ఖాద్రీ సాహెబ్ (బాణీ వ సర్పరస్త్ సిల్సిలా-యే- ము అజ్జమియా యాకూబియా) ముఖ్య అతిథిముఫక్కిర్- యే-ఇస్లామ్, ఖతీబుల్ ఉమ్మత్ హజ్రత్ మౌలానా ముఫ్తీ ఖారీ అహ్మద్ అలీ ఫలాహీ మజాహిరీ నఖ్షబంది సాహెబ్ (జూరత్ గుజరాత్ జామియా ఫైజ్ ఏ సులేమానియా శైఖుల్ హదీస్).ఈ కార్యక్రమంలో హజ్రత్ అల్లామా మౌలానా మహమ్మద్ అమ్జద్ అలీ షా యాకూబీ, హాఫిజ్ వ ఖారీ మహమ్మద్ మజీదుద్దీన్ నాజిమ్లతో పాటు పలువురు ఆధ్యాత్మిక వేత్తలు, మతపెద్దలు ప్రసంగించనున్నారు.సమయ వేళలు మరియు సమాచారం,భోజన సౌకర్యం.. సాయంత్రం మగ్రిబ్ ప్రార్థనల నుండి ఇషా ప్రార్థనల వరకు తఆమ్ (భోజనం) ఏర్పాటు చేయబడింది కార్యక్రమ ప్రారంభం,ఇషా నమాజ్ తర్వాత సభ ప్రారంభమవుతుంది. నిర్వాహకులు సమయపాలన పాటించబడుతుందని స్పష్టం చేశారు.ధార్మిక పరిజ్ఞానం,సమాజ శ్రేయస్సును కాంక్షించే ఇల్మ్ ప్రేమికులు, సోదరులుందరూ ఈ పవిత్ర కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా గుల్షన్ దాతార్ ఫౌండేషన్ మరియు సిల్సిలా ఖాదిమీన్ ప్రతినిధులు కోరారు.

# జాతీయ కబడ్డీలో కాంస్యం సాధించిన ఆకాంక్ష విద్యార్థి

## - భాను ప్రకాష్‌ను సన్మానించిన

## - మంత్రి కోమటిరెడ్డి

**హాలియా,ఆగస్టు16(ప్రజా జ్యోతి)**

నల్గొండ జిల్లా క్రీడా ప్రతిభ జాతీయ స్థాయిలో మరోసారి మెరిసింది.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 69 వ జాతీయ స్థాయి అండర్-17 బాలుర కబడ్డీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించిన హాలియా పట్టణంలోని ఆకాంక్ష ఉన్నత పాఠశాల విద్యార్థి భాను ప్రకాష్‌ను ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో శనివారం ఘనంగా సత్కరించారు.ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్లు,భవనాలు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,నల్గొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్,మేయర్ బుర్రి చైతన్యలు భాను ప్రకాష్‌ను ప్రత్యేకంగా అభినందించి అవార్డును అందజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా క్రీడాధికారి డివై ఎస్ఓ అక్బర్ అలీ భాను ప్రకాష్ సాధించిన జాతీయ స్థాయి విజయాన్ని కొనియాడారు.అలాగే భాను ప్రకాష్‌ను జాతీయ స్థాయి క్రీడాకారుడిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించి,నిరంతరం శిక్షణ అందించిన కోచ్ ఆవుల చంద్రశేఖర్‌ను ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు,అధికారులు అభినందించారు.భాను ప్రకాష్ సాధించిన ఈ విజయం అతని కఠిన శ్రమ,పట్టుదలతో పాటు కోచ్ సమర్థవంతమైన శిక్షణకు నిదర్శనమని,ఈ గెలుపు నల్గొండ జిల్లాలోని యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పలువురు ప్రశంసించారు.భవిష్యత్తులో భాను ప్రకాష్ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని,నల్గొండ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రానికి విశేష కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆకాంక్ష ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మేడేపల్లి మోహన్ రావు డైరెక్టర్ ఉన్నం శ్రీనుబాబు,ప్రిన్సిపాల్ మొదాల రవీందర్,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందిస్తూ ఆకాంక్షించారు.



# అనుముల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా మదన్ రెడ్డి

**హాలియా,ఆగస్టు16(ప్రజా జ్యోతి)**



అనుముల మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా నాయుడుపాలెం సర్పంచ్ కందుల మదన్ రెడ్డిని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి నియమించారు ఆదివారం హాలియా క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారికంగా ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్ మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి,ప్రజల సమస్యల పరిష్కారానికి సర్పంచులందరినీ సమన్వయం చేస్తూ నూతన పాలకవర్గం బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అనుముల మండలంలో ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ చేరవేసేలా సర్పంచ్ ల ఫోరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వల్లభ రెడ్డి,వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, హాలియా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గౌని రాజ రమేష్ యాదవ్,యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భానుచందర్ రెడ్డి, రవి నాయక్,లాలు నాయక్, పగడాల సైదులు,బిట్టు రవి,బద్రి నాయక్ తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన కందుల మదన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా ముత్యాలమ్మ బోనాల పండుగ..

## - అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించిన మహిళలు..

## - భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను నిర్వహించిన గ్రామస్తులు..

**నల్గొండ ఆగస్టు 16,(ప్రజా జ్యోతి):**



నల్గొండ మండల పరిధిలోని దండేంపల్లి గ్రామంలో తెలంగాణ సంస్కృతిలో భాగమైన గ్రామ దేవత ముత్యాలమ్మ కు మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆదివారం బోనాలు సమర్పించుకున్నారు. శ్రావణ మాసం సందర్భంగా గ్రామస్తులు మహిళలు కుటుంబ సమేతంగా కొత్త కుండలో బోనాలు తయారు చేసి సాంప్రదాయ వస్త్రదానతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు .మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాల కుండలను ఇంటి వద్ద నుంచి డప్పు వాయిద్యాల నడుమ గ్రామ దేవత అయిన ముత్యాలమ్మ తల్లి కి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఊరి ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించి ఎలాంటి అంటువ్యాధులు రాకుండా గ్రామ దేవత కాపాడాలని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో.. జాతీయ మాల మహానాడు నేషనల్ స్టీరింగ్ కమిటీ సభ్యులు గోలు సైదులు చింతపల్లి శ్రీను చింతపల్లి అఖిల్ చింతపల్లి చైతన్య, బోగరి కల్పన, చాందిని, చింతపల్లి సావిత్ర, యాదమ్మ, శ్రావ్య, సరిత, రమ్య, పలువురు మహిళలు స్థానిక ప్రజలు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైజాగ్ కాలనీలో భద్రత లేని బోటింగ్ ప్రయాణాలు

# పర్యాటకుల ప్రాణాలతో నిర్వాహకుల చెలగాటం

**దేవరకొండ,నరేడుగొమ్ము, ఆగస్టు 16 ,( ప్రజా జ్యోతి ) :**


నల్గొండ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన నరేడుగొమ్ము మండలం వైజాగ్ కాలనీ నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్స్‌లో బోటింగ్ నిర్వాహకులు కనీస రక్షణ చర్యలు పాటించకుండా పర్యాటకుల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. వీకెండ్స్‌లో పర్యాటకుల రద్దీని ఆసరాగా చేసుకుని, కేవలం లాభాలే ధ్యేయంగా బోటు యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం బోటింగ్‌కు వెళ్లే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించాలి. కానీ ఇక్కడ పర్యాటకులు ఎలాంటి లైఫ్ జాకెట్లు లేకుండానే ప్రమాదకరంగా నీటి ప్రయాణం చేస్తున్నారు. గతంలో దేశంలో పలుచోట్ల ఘోర బోటు ప్రమాదాలు జరిగినప్పటికీ, ఇక్కడి నిర్వాహకులలో ఎలాంటి మార్పు రాలేదని, కనీస భద్రతా వసతులు కల్పించడం లేదని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కృష్ణా నది బ్యాక్‌వాటర్స్ లోతు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరిగే అవకాశం మెండుగా ఉంది. కాబట్టి సంబంధిత పర్యాటక, పోలీస్ మరియు రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, ఇక్కడి బోటింగ్‌పై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుని పర్యాటకులకు పూర్తి భద్రత కల్పించాలని స్థానికులు మరియు పర్యాటక ప్రేమికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.





# సచివాలయ ఉద్యోగాల ఎర.. రూ.10 లక్షల టోకరా!



- ఉన్నతాధికారుల పేరుతో నమ్మించి.. నట్టేట ముంచి!
- మూడేళ్లు గడిచినా కొలువు రాక.. పైసలూ ఇయ్యక తప్పించుకు తిరుగుడు
- 'సర్కారు మారింది.. నా దగ్గర లేవు' అంటూ కేటుగాడి ఎదురుదాడి
- చౌటుప్పల్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు






**చౌటుప్పల్, ఆగస్టు 16 (ప్రజా జ్యోతి ):**

**తెలంగాణ**

రాష్ట్ర సచివాలయంలో (సెక్రటేరియట్) పక్కా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ తీపి మాటలతో బురిడీ కొట్టించి అమాయకుల నుంచి ఏకంగా రూ.10 లక్షలు కాజేసిన ఘరానా మోసం వెలుగుచూసింది. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలు ప్రభుత్వ ఉద్యోగం వస్తుందన్న ఆశతో అందినకాడికి అప్పులు తెచ్చి సమర్పించుకోగా.. తీరా మూడేళ్లయినా ఉద్యోగమూ రాక, పైసలూ తిరిగివ్వకపోవడంతో నట్టేట మునిగామని లబోదిబోమంటున్నారు.

**- రాజకీయ నాయకులు ఉన్నతాధికారుల పేరిట ఎర..**

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా తిప్పర్తికి చెందిన మహ్మద్ సోయల్ అన్సారీ అనే వ్యక్తి చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారంలో పరిచయాలు పెంచుకున్నాడు. హైదరాబాద్ సచివాలయంలోని ఉన్నత స్థాయి అధికారులలు, రాజకీయ నాయకులకు తనకు బలమైన పరిచయాలు, పైరవీలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పించడం చిటికెలో పనంటూ గొప్పలు చెప్పాడు. అతని మాటలను గుడ్డిగా నమ్మిన బాధితులు ఉద్యోగాల ఆశతో 2023 జూలై 5న విడతల వారీగా పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పారు.

**- మూడు కుటుంబాల నుంచి రూ.10 లక్షలు స్వాహా..**

ఈ క్రమంలో మహ్మద్ సోయల్ అన్సారీ ఒక్కో కుటుంబం నుంచి ఉద్యోగం పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేశాడు. బాధిత వ్యక్తులైన షేక్ హిమాంబ్ సబ్ వద్ద నుంచి రూ. 5 లక్షలు, సయ్యద్ మౌలానా వద్ద నుంచి రూ. 3 లక్షలు, షేక్ గలీబి వద్ద నుంచి రూ. 2 లక్షల చొప్పున మొత్తం రూ. 10 లక్షల నగదును గుంజాడు. త్వరలోనే ఆర్డర్ కాపీలు మీ చేతికి అందుతాయని నమ్మబలికి కాలయాపన చేస్తూ వచ్చాడు. తీరా డబ్బులు చేతికి అందాక ముఖం చాటేశాడు.

**- రాష్ట్రంలో పాలన మారింది.. పైసల్లేవు!'**

డబ్బులు చెల్లించి మూడేళ్లు గడుస్తున్నా ఎలాంటి పురోగతి లేకపోవడంతో బాధితులు అతడిని గట్టిగా నిలదీశారు. దాంతో సదరు వ్యక్తి అసలు రంగు బయటపెట్టి.. 'రాష్ట్రంలో పాలన మారింది.. నా వద్ద రూపాయి కూడా లేదు' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం దాటవేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

**- పోలీసులను ఆశ్రయించిన బాధితులు**

అప్పులపాలై, వడ్డీలు కట్టలేక తీవ్ర ఆర్థిక, మానసిక క్షోభకు గురైన బాధితులు చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాము చెల్లించిన రూ.10 లక్షల నగదును రికవరీ చేయించి, అమాయకుల జీవితాలతో ఆడుకున్న మోసగాడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీసులకు కోరారు.

# పేదల చివరి ప్రయాణానికీ కష్టాలే
# పార్థివ వాహన సేవలకు నిధుల కొరత




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 16(ప్రజాజ్యోతి):**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఎవరైనా మృతి చెందితే వారి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు ఉచిత పార్థివ వాహన సేవలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.ప్రైవేట్ అంబులెన్సులు అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న నేపథ్యంలో పేద ప్రజలకు అండగా ఉండేందుకు 2016 నవంబర్‌లో అప్పటి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 50 పార్థివ వాహనాలతో ఈ సేవలను ప్రారంభించింది.ఈ సేవల నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం టెండర్ ద్వారా ఒక నిర్వహణ సంస్థకు అప్పగించి కొనసాగిస్తోంది. అయితే గత రెండేళ్లుగా నిర్వహణ సంస్థకు ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు విడుదల కావడంలో జాప్యం జరుగుతోందని సమాచారం.దీంతో వాహన సిబ్బందికి జీతాలు, డీజిల్ ఖర్చులు, వాహనాల మరమ్మతులు, ఇతర నిర్వహణ ఖర్చులను భరించడం కష్టంగా మారిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.సిబ్బందికి కూడా సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది.ఈ సమస్యపై నిర్వహణ సంస్థ అధికారులు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిధుల విడుదలలో జాప్యం కొనసాగుతోందని సమాచారం.ఈ నేపథ్యంలో నిర్వహణ సంస్థ ప్రభుత్వం వద్ద ఒక నెల ముందస్తు నోటీసు ఇచ్చినట్లు,నిధుల సమస్య పరిష్కారం కాకపోతే సెప్టెంబర్ 01-2026 నుంచి పార్థివ వాహన సేవలు నిలిచిపోయే పరిస్థితి ఉందని సమాచారం.ఇదే విధంగా 108,102 అత్యవసర సేవల నిర్వహణకు సంబంధించిన నిధుల విడుదలలోనూ జాప్యం జరుగుతోందని,భవిష్యత్తులో వాటి నిర్వహణ కూడా కష్టతరంగా మారే అవకాశం ఉందని ఉద్యోగులు,సంబంధిత వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఒక కుటుంబంలో ఆప్తుడిని కోల్పోయిన సమయంలో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లడం కూడా అదనపు ఆర్థిక భారంగా మారకూడదు.ముఖ్యంగా పేద,మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేట్ అంబులెన్సుల అధిక ఛార్జీలను భరించాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది.పార్థివ వాహనాల నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసి,సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు వాహనాల నిర్వహణకు అవసరమైన ఖర్చులను సమకూర్చి ఈ సేవలను నిరంతరాయంగా కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

# దాడులకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించాల్సిందే!

## - మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్ కుమార్

- బీఆర్ఎస్ కార్యకర్త చంద్రకాంత్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే..
- పదేళ్ల పాలనలో శాంతియుతంగా అభివృద్ధికి కృషి చేశానన్న కిశోర్
- దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరిక




**తుంగతుర్తి,(జాజిరెడ్డిగూడెం), ఆగస్టు 16,(ప్రజా జ్యోతి):**



తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పాలనలో దౌర్భాగ్యకర పరిస్థితులు నెలకొన్నాయని మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్ కుమార్ ఆరోపించారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం లో కాంగ్రెస్ గుండాల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త గునిగంటి చంద్రకాంత్ ను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న పదేళ్ల కాలంలో ఎలాంటి గొడవలు, కక్షలకు తావులేకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని కిశోర్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో దాడులు, కక్షలు, హత్యలకు కాంగ్రెస్ పార్టీ ప్రోత్సాహం ఇస్తోందని ఆరోపించారు.బీఆర్ఎస్ కార్యకర్త చంద్రకాంత్‌పై దాడి చేసిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా స్థానిక సీఐ, ఎస్ఐలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పోలీసు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం కుదరదని, రాజ్యాంగానికి లోబడి విధులు నిర్వహించాలని సూచించారు.దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే సీఐ, ఎస్ఐల వ్యవహారశైలిని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఓపిక నశిస్తే పరిస్థితులు మరోలా ఉంటాయని అన్నారు.అధికారం శాశ్వతం కాదని, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన వారిపై చట్టపరంగా తగిన విధంగా పోరాడుతామని కిశోర్ కుమార్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, పార్టీ అధినేత కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను అబద్ధాలతో మభ్యపెడుతున్నారని కిశోర్ కుమార్ విమర్శించారు. అబద్ధాలకు సీఎం రేవంత్ రెడ్డి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పై నాయకత్వం ఏ విధంగా ఉందో కిందిస్థాయి నాయకత్వం కూడా అదే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.నియోజకవర్గంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు, వేధింపులు పునరావృతమైతే పార్టీ తరపున తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరించారు.

# ఘనంగా భవితారెడ్డి పుట్టినరోజు వేడుక

- చిన్నారిని దీవించిన నాయకులు గ్రామ ప్రజలు



**పెన్ పహాడ్ ఆగస్టు 16 (ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని చీదేళ్ల గ్రామంలో ఈరోజు పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న జూలకంటి వెంకట్ రెడ్డి (మాజీ ఎంపిటిసి)- జూలకంటి ప్రమీల (సింగిల్విండో డైరెక్టర్) చిన్న మనవరాలు జూలకంటి రాజశేఖర్ రెడ్డి - మమతల చిన్న కూతురు అయిన జూలకంటి భవితారెడ్డి పుట్టినరోజు వేడుకలు గ్రామంలో వారి కుటుంబ సభ్యుల మధ్య అంగరంగ వైభవంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించటం జరిగింది ఈ వేడుకలో గ్రామ ప్రజలు నాయకులు యువకులు తదితర ముఖ్యులు పాల్గొని భవిత రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండి విద్య అభ్యసన అనంతరం మంచిగా స్థిరపడాలని గ్రామ ప్రజలు పలువురు నాయకులు కుటుంబ సభ్యులు మనసారా దీవించారు.

# ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య .. క్యూరా గ్లోబల్ ఇంచార్జ్ వల్లూరి మురళి కృష్ణ

**నిడమానూరు,ఆగష్టు 16(ప్రజాజ్యోతి):**

ప్రభుత్వ పాఠశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయుల ఉన్నందున మెరుగైన విద్య సాధ్యమవుతుందని క్యూరా గ్లోబల్ హెడ్ డాక్టర్ వల్లూరి మురళీకృష్ణ అన్నారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని బంకాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్ కు చెందిన క్యూరా గ్లోబల్ సంస్థ సౌజన్యంతో స్పోర్ట్స్ డ్రెస్, షూ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి భవిష్యత్తు పోటీ పరీక్షల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా మా సంస్థ తరఫున విద్యార్థుల కోసం అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉన్నం చిన వెంకటేశ్వర్లు, రాయపాటి పేరయ్య, పేలపూడి బాలకృష్ణ, పాంపాటి యాదగిరి, ఎన్ఆర్ఐ సుధీర్, వెంకటేశ్వరరావు వార్డు మెంబర్లు బండారు రామయ్య, మరియమ్మ, ఉష, ప్రధానోపాధ్యాయుడు రామారావు, రవి సెక్రటరీ శోభ, రసీదా, తదితరులు, పాల్గొన్నారు.




# తాత జ్ఞాపకార్థం.. విద్యార్థులకు బ్యాగులు పంపిణీ..

**నూతనకల్, ఆఘుస్ట్ 16, (ప్రజాజ్యోతి):**

మండల పరిధిలోని చిల్పకుంట్ల పాఠశాలలో విద్యార్థులకు ఉచిత బ్యాగులు పంపిణీ చేశారు గ్రామానికి చెందిన పుల్సు సత్యం.. గ్రామానికి చెందిని బిక్కి పుల్లయ్య రెండవ వర్ధంతి సంధర్భంగా ఈ ఆయ జ్ఞాపకార్థంగా గ్రామంలోని పాఠశాలలో విధ్యనభ్యసిస్తున్న 57 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉచిత బ్యాగులను అందచేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.. విదేశాలలో విద్యను అభ్యసిస్తునన తమ మనువడు నవీన్ గౌడ్ చిన్నారులకు ఈ బ్యాగులు పంపించినట్లు తెలిపారు.. నాటి రజాకార్ ఉద్యమాల కాలంలో పేద ప్రజలకు అండగా ఎన్ని పోరాటాలు చేసిన గొప్ప మహనీయుడు పుల్లయ్య అని కొనియాడారు.. అనునిత్యం పేద ప్రజల అభ్యున్నతికి పాడు పడిన వ్యక్తి అని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు సోంబాబు, గ్రామ సర్పంచ్ అంజపల్లి నర్సమ్మ, పంచాచితీ కార్యదర్శి గంగరాజు, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్ అన్న పూర్ణ, ఆశావర్కర్లు, భరత్, రాజేష్, గణేష్, ఆకాశ్, విద్యార్థిని విద్యార్థులు.. తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..



# నకిరేకల్ పట్టణంలో అత్యంత వైభవంగా ముత్యాలమ్మ అమ్మవారి బోనాలు

**నకిరేకల్, ఆగస్టు 16: ప్రజా జ్యోతి**

నకిరేకల్ పట్టణంలోని శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లగాటి ప్రసన్నరాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా నల్లగాటి ప్రసన్నరాజ్ మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గ ప్రజలందరికీ ముత్యాలమ్మ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి కృపతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముత్యాలమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగలో - దైద రవీందర్

**నకిరేకల్, ఆగస్టు 16: ప్రజా జ్యోతి**

నకిరేకల్ పట్టణంలో శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం నకిరేకల్ పట్టణ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గర్లపాటి రవీందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల నాగయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి


**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 16(ప్రజాజ్యోతి):**

మండల స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ నెల 17వ తేదీ నుంచి ప్రతి సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి,వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయిలోని రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య, విద్య, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, అటవీ, అంగన్వాడీ తదితర శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు.కావున ఆయా మండలాల పరిధిలోని గ్రామాల ప్రజలు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

## ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి

**చివ్వెంల ఆగస్టు 16(ప్రజాజ్యోతి):**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని,వాటికి సత్వర పరిష్కారం చూపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చివ్వెంల ఎంపీడీవో తెలిపారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ క్రమంలో ఆగస్టు 17,సోమవారం ఉదయం 10 గంటలకు చివ్వెంల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు.మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు,వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటో పట్టివేత

**నిడమనూరు, ఆగస్టు 16 (ప్రజా జ్యోతి) :**





మండలకేంద్ర శివారులోని నర్సింహాలగూడెంలో ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు పోలీసులు పెట్రోలింగ్ డ్యూటీలో భాగంగా వాహనాలు తనిఖీలు చేస్తుండగా అదే సమయంలో ముప్పారం వైపు నుంచి త్రిపురారం వైపు ఆటో.. లోడుతో అనుమానాస్పదంగా వెళ్తుతుండగా పోలీసులు ఆ ఆటోను నిలిపి ( బజాజ్ ఆటో.ు+ 05 ు 7755) ను క్షుణ్ణంగా పరిశీలించి చూడగా ఆటోలో కొన్ని కర్నూల్ రైస్ బియ్యం బస్తాలాగా ఉనట్లు గుర్తించి..అట్టి బియ్యం బస్తాలు తనిఖీ చేయగా పిడిఎస్ బియ్యం బయటపడ్డాయి .మొత్తం 34 బియ్యం బస్తాలు, ప్రతి బస్తా సుమారు 25కేజి ఉన్నాయి.ఈ ఆటోలో మొత్తం 850 కేజీల బియ్యం బస్తాలున్నాయి. ఈ బియ్యం బస్తాలకు సంబందించి ప్రభుత్వ అనుమతి పత్రాలు చూపమని అడగగా, తన వద్ద బియ్యనికి సంబందించి ఎలాంటి ప్రబుత్వ అనుమతి పత్రాలు లేవని ఆటో డ్రైవరు మాకు తెలిపినాడు. డ్రైవరు పేరు విచారించగా దనావత్ రాజు మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని దామరచర్ల మండలం వీర్లపాలెం స్వగ్రామం.. ప్రస్తుతం అశోకనగర్ మిర్యాలగూడ అని తెలిపినాడు . కానీ ఆటోలో బియ్యం నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామంలో రాంబాబు అనే వ్యక్తి నుండి త్రిపురారం వైపు తీసుకుని వెళ్లుతున్నాం.ఈ ఆటో డ్రైవర్ వద్ద ఏలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా పిడిఎస్ బియ్యంను ఆటోలో లోడ్ చేసుకొని తీసుకొని వెళ్తున్న డ్రైవరు దనవత్ రాజు ని, బియ్యంలోడ్ ఆటోని తీసుకోని వెళ్తుండగా నిడమానూరు పోలీసులు పట్టుబడిచెసి ఆటోను నిడమానూరు పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు నిడమనూర్ ఎస్ ఐ విజయ్ స్టేషన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

